ఆగష్టు 25
వరలక్ష్మీ వ్రతము

సంచిక 12 | ఆగష్టు 2023

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక



## అంతరార్ధము
శ్రీ దేవి ఖడ్గమాల

## గురువాణి
శ్రావణ మాస విశిష్టత

## శ్రీవిద్యా మందిరాలు
కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మీ

## శ్రీవిద్యా సాధన
శ్రీ దత్తాత్రేయ ఉపాసన



# శ్రీ మహాలక్ష్మి ధ్యానం

ఓం అక్షస్రక్ పరశుం గదేషుకులిశం పద్మం ధనుష్కుండికాం
దండం శక్తిమసిం చ చర్మ జలజం ఘంటాం సురాభాజనమ్
శూలం పాశ సుదర్శనే చ దధతీం హస్తైః ప్రసన్నాననాం
సేవే సైరిభమర్దినీమిహ మహాలక్ష్మీం సరోజస్థితామ్

# గురువాణి

విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -1 సంచిక - 12, ఆగష్టు 2023,
37 పేజీలు

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రికను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter | Follow on Facebook | Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**
(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I,
Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

**ఈ సంచికలో** — **పేజీ**

**కవర్ పేజీ చిత్రము**
మహాలక్ష్మి

**ధ్యానం**
శ్రీ మహాలక్ష్మి ధ్యానం — 02

**గురువాణి**
శ్రావణ మాస విశిష్టత — 04

**అంతరార్థము**
శ్రీ దేవి ఖడ్గమాల — 06

**శ్రీ విద్యా జ్ఞాన పీఠము సమాచారం** — 09

**శ్రీవిద్యా సాధన**
శ్రీ దత్తాత్రేయ ఉపాసన — 12

**శ్రీవిద్యా మందిరాలు**
కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి ఆలయం — 18

**నివారణోపాయములు**
నివారణోపాయాలు (నాల్గవ భాగము) — 24

**ప్రశ్నలు – సమాధానములు** — 26


**సాధకుల అనుభవాలు** — 28

**బాలల విభాగము** — 29

**రాబోయే కార్యక్రమాలు / జరిగిన కార్యక్రమలు** — 32

**కాల నిర్ణయ పట్టిక** — 35

**చివరి పేజీ చిత్రము**
మహాలక్ష్మి



# గురువాణి

గురూజీ సందేశము

# శ్రావణ మాస విశిష్టత

## శ్రీ గురు కరుణామయ

**శ్రీ మాత్రే నమః**

శ్రావణ మాసం యొక్క విశిష్టత ఈ మాసం లో మనకి మొదటగా ఋతువు మారుతుంది అది వర్ష ఋతువు. రైతులకి ఆ యొక్క వరుణుడి అనుగ్రహం వల్ల పాడి పంటలు బాగా పండుతాయి.

శ్రావణ మాసం లో పౌర్ణమి నాడు చంద్రుడు శ్రవణా నక్షత్ర సంచారం వల్ల ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది.

శ్రావణ మాసం లో ఋతువు మారుతుంది అది వర్ష ఋతువు. రైతులకి ఆ యొక్క వరుణుడి అనుగ్రహం వల్ల పాడి పంటలు బాగా పండుతాయి.

ఈ మాసం లో జన్మించినవారు సాధారణం గా అనేక వైదిక కర్మలందు నిష్ణార్తులై ,ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ పుణ్య కీర్తిని పొందుతారు .సమాజ సేవ లో కూడా నిమాగ్నం అవుతారు అని చెప్పబడుతుంది. మనకి సాక్ష్యాత్తూ దైవ స్వరూపులు జన్మించారు.

గీతాచార్యుడు అయిన కృష్ణ పరమాత్మ జన్మించిన ఈ మాసంలో జన్మించారు. కాబట్టి మనం **కృష్ణాష్టమి**ని జరుపుకుంటాం. ఈ మాసం లో కృష్ణున్నీ ఆరాధించడం వల్ల **నిభందనలు లేనటువంటి ప్రేమ** అతిశయించి, దాంపత్య జీవనం సౌఖ్యం గా ఉంటుంది.

మనకి లలితా సహస్ర నామాన్ని అందించిన **హయగ్రీవ జయంతి** కూడా ఈ మాసం లోనే. ఈ మాసం లో ప్రతి రోజు **లలితా సహస్ర నామ పారాయణం** ఎంతో ఫలప్రదం.

గరుత్మంతుడు తన తల్లిని దాస్యశృంఖలాలనించి విముక్తి కోసం అమృత భండాన్ని సేకరించింది కూడా ఈ మాసం లోనే.

శ్రావణ మాసం లో వచ్చే ముఖ్యమైన పండుగలు మరియు వ్రతాలూ వాటి యొక్క విశిష్టత :

**శ్రావణ మంగళ గౌరీ వ్రతం:**
ప్రతి మంగళ వారం స్త్రీలు భర్త క్షేమం కోరి చేస్తారు. ఇది **స్త్రీలకు సౌభాగ్యాన్ని ఇచ్చే అపూర్వమైన వ్రతం**.

**శ్రావణ లక్ష్మి - వరలక్ష్మి వ్రతం:**
శుక్రవారం నాడు లక్ష్మీదేవి ని పూజిస్తూ, మరియు సౌభాగ్యాన్ని కోరుతూ **శ్రావణ పౌర్ణమి కి ముందు వచ్చే శుక్రవారం** వరలక్ష్మి వ్రతం చేస్తారు. **అఖండ సౌభాగ్యం** ఇస్తుంది. దక్షిణ భారత దేశం లో ప్రసిద్ధి పొందింది.

**శ్రావణ శనివారాల వ్రతం:**
ఇది చేసుకోవడం వలన సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం అయినటువంటి ఆ లక్ష్మి అలివేలుమంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం వలన శని భగవానుని అనుగ్రహం పొందుతారు మరియు **ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని ప్రభావం నించి ఉపశమనం** లభిస్తుంది.

**రాఖీ పౌర్ణమి:**
భారతదేశంలో **సోదర సోదరి అనుబంధాన్నీ** పెంచుకోవడానికి రక్ష బంధనం పండుగని జరుపుకుంటారు.

**జంధ్యాల పౌర్ణమి:**
నూతన యజ్ఞోపవీత ధారణ మరియు **ఉపాకర్మ** జరుపుకుంటారు.

**నాగ పంచమి వ్రతం:**
దీనివలన మనకి అంతర్లీనంగా ఉన్న **కుండలిని శక్తి జాగృతం** అవుతుంది. **సర్ప, నాగ దోషాలు పోవడానికి దీనిని ఆచరిస్తారు**.

**సూర్య సుపొదన వ్రతం:**
సూర్యునికి పప్పు అన్నం నైవేద్యం పెట్టి ,విశేష అర్చన చెయ్యడం వల్ల **చర్మ మరియు నేత్ర సంబంధిత రోగాలు ఉపశమిస్తాయి**.


సోమవారం నాడు శివారాధన చేస్తారు. శివుడు, విష్ణువు, లక్ష్మి ముగ్గుర్ని అర్చన చేసే గొప్ప మాసం ఈ శ్రావణ మాసం.

ఈ మాసం లో ఒక చేసిన జపం చేసిన, వ్రతం చేసిన, దానం చేసిన దానికి వేల రెట్లు ఫలితం వస్తుంది. అందుకే ఉపాసాకులందరూ కూడ ఈ శ్రావణ మాసం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటారు.

**అష్టాష్టమి వ్రతం:**
అన్నిటికంటే అతి గుహ్యామైన రహస్యాతి రహస్యమైన వ్రతం **అష్టాష్టమి వ్రతం**. ఎనిమిది మంది యోగిని దేవతలు ,ఎనిమిది మంది భైరవులను దంపతులుగా అర్చిస్తూ, అష్టదళపద్మం తో వారితో కూడిన మహా లక్ష్మి దేవిని అర్చిస్తాం. ఇది పరశురామ కల్పసూత్రం లో రహస్యం గా చెప్పబడినటువంటి వ్రతం. **ఇది ఎవరైతే చేస్తారో ఇహపర సాధనలో అశేషమైన ఫలితాలు లభిస్తాయి, సౌభాగ్యానికి లోటు ఉండదు.** ఇది పరశురామ కల్పసూత్రం ప్రకారం శ్రీవిద్య ఉపాసకులు మరియు గురువులతో చేయించుకునే ఒక విశిష్టమైన పూజ ప్రక్రియ ఇందులో ఎనిమిది మంది దంపతులు మరియు ఒక సువాసినిని లక్ష్మి స్వరూపంగా కూర్చోబెట్టి చేసే ప్రక్రియ.

సంపుటి - 1 సంచిక 1





# శ్రీ దేవి ఖడ్గమాల

**ఈ సంచిక నుండి "అంతరార్థము" శీర్షికలో మన గురూజీ వివరించిన**
**"శ్రీ దేవి ఖడ్గమాల అంతరార్థము"**
**ప్రచురిస్తున్నాము.**



# శ్రీ దేవి ఖడ్గమాల

(ఉపోద్ఘాతము)

## లలితా పరమేశ్వరిని స్తుతించే అత్యంత శక్తివంతమైన స్తోత్రాలలో ఖడ్గమాల ఒకటి.

శ్రీ విద్యలో చాలా ముఖ్యమైన నాలుగు స్తోత్రాలు ఉన్నాయి.

1. లలితా సహస్రనామం
2. శ్రీ లలితా త్రిశతి
3. లలితా అష్టోత్తర శత నామావళి.
4. ఖడ్గమాల

వీనిలో ఖడ్గమాల అమ్మవారి యంత్ర స్వరూపాన్ని వివరిస్తుంది. ఖడ్గము అనగా కత్తి అని అర్థం. దానిని ఖండించటానికి ఉపయోగిస్తారు. విచిత్రమేమిటంటే చాలా మంది ఖడ్గమాల చదవడానికి భయపడతారు. అది హాని చేస్తుందని మరియు దీక్ష లేకుండా పారాయణం చేస్తే చెడు పరిణామాలు ఉంటాయని భావిస్తారు. వాస్తవానికి, అంతర్గత అర్థాన్ని తెలుసుకుంటే, ఖడ్గమాల చాలా శక్తివంతమైనది. ఖడ్గము జ్ఞానాన్ని సూచిస్తుంది. ఆ రకమైన అత్యున్నత జ్ఞానం అహం తో కూడి ఉంటే, అది జీవితానికి గొప్ప అడ్డంకి కావచ్చు.

దశ మహావిద్యలలో ఈ భావనను సూచించే దేవతలలో ఛిన్నమస్త ఒకరు. ఛిన్న మస్త అంటే, తన తలను తానే ఖండించుకునే దేవత.తరచి చూస్తే, జీవుడు ఈ విధంగానే తన అహంకారాన్ని ఖండించుకోవాలని అమ్మవారు చెబుతున్నది. నిజానికి అంతరార్థం తీసుకుంటే సాధారణముగా మనిషి జ్ఞానాన్ని సంపాదించిన తర్వాత తాను ఏదో చాలా సంపాదించినట్లు అహంకారం తలకెక్కుతుంది. ఇలా అనంతమైనదానిని, కేవలం 'దేనికో ఒకదానికి' కి పరిమితం చేయడాన్ని అహంకారము అంటారు. ఆ అహంకారాన్ని ఆ తల్లి ఖండిస్తుంది అని అర్థము.

అహంకారము అంటే కేవలం అహంకార భావమే కాదు. ఉదాహరణకు, "రక్తం, శ్లేష్మం, ఎముక మరియు మాంసాలతో మాత్రమే ఏర్పడిన ఈ శరీరమే నేను" అనే భావన కూడా అహంకారమే. "నేను బ్రాహ్మణుడను" అని అనుకోవడం అహంకారం. "తాను తప్ప మరియొకడు దేనికీ సరిపోడు, వాడు కేవలం మానవుడు, మర్త్యుడు" అని ఇలా ఆలోచించడం కూడా అహంకారమే.

"నేను జీవుడను, ఏమీ చేయలేను" అని అనుకోవడం కూడా అహంకారమే.

ఖడ్గమాల, "హ్రీంకారసన గర్భితాం" తో మొదలై "మహా మహా త్రిపుర సుందరి"తో ముగుస్తుంది. అంటే మనది కేవలం పాంచభౌతిక దేహము (5 మూలక శరీరం) కాదు; మనలో, హ్రీంకార రూపంలో తల్లి నివసిస్తూ ఉంటుంది అని అర్థము. "హ్రీం" అనేది అహంకారాన్ని కాల్చివేసే శక్తి లేదా అగ్ని. అహంకారము ఛిద్రమైనప్పుడు విశ్వముతో ఏకత్వము కలుగుతుంది. ఖడ్గమాల గొప్పతనం అలాంటిది.

ఖడ్గమాలలో, శ్రీ చక్రము లోని నవావరణాలలో (తొమ్మిది అవరణలు) ఉన్న 102 మంది దేవతల ప్రసక్తి వస్తుంది. ఇది కాకుండా, బాణిని, చాపిని, పాశిని, అంకుశిని అనే ఆయుధ దేవతల గురించి కూడా చెప్పబడింది. దానికి తోడు పరమేశ్వరిని ఖడ్గమాలచే పూజించే, మిత్రేశమయి, షష్టీశమయి వంటి ఉపాసకుల ప్రసక్తి కూడా వస్తుంది. కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్నా వంటి నిత్య దేవతలు మరియు హృదయదేవి, శిరోదేవి, శిఖాదేవి మొదలగు అంగదేవతలు దర్శనమిస్తారు.

ఖడ్గమాల పారాయణం ప్రారంభించాలి అంటే ముందుగా ఖడ్గమాల ఎలా ఉచ్చరించాలో తెలుసుకోవాలి. మనం మొదట్లో సరిగ్గా ఉచ్చరించ లేకపోయినా ఫర్వాలేదు. దాని వలన ఎటువంటి దోషం లేదా ప్రతికూల ప్రభావాలు ఉండవు. పరీక్షలో మన సమాధానాలు ఎంత ఖచ్చితమైనవి అనే దాని ఆధారంగా మనకు మార్కులు వస్తాయి కదా! అన్ని సమాధానాలు మనము సరిగ్గా ఇచ్చినట్లయితే మనకు పూర్తి వంద మార్కులు వస్తాయి. లేదంటే ఎన్ని సరైన సమాధానాలు ఇస్తామో అన్ని మార్కులు వస్తాయి. అదే విధంగా మనం ఎంత చక్కగా దీనిని జపిస్తామో ఆ మేరకు ప్రయోజనాలను పొందుతాము.

ఖడ్గ మాల నేర్చుకునే సమయములో క్లిష్టమైన సంధి సమాసాలతో కూడిన పదాలు వచ్చినప్పుడు దానిని సులభంగా అర్థం చేసుకోగలిగే పదాలుగా విభజించి అర్థము చేసుకోవాలి. తదుపరి వాటిని మళ్ళీ కలిపి ఉన్నది ఉన్నట్టుగా చదువుకోవాలి.

**ధ్యాన శ్లోకం**

అన్ని స్తోత్రాల వలెనే 'ఖడ్గమాల' కూడా 'ధ్యాన శ్లోకం'తో మొదలవుతుంది. మనం ఏదైనా ధ్యాన శ్లోకాన్ని గమనిస్తే, దేవత యొక్క తత్త్వం మొదటి పదంలోనే వివరించబడుతుంది. లలితా సహస్రనామంలో, ధ్యాన శ్లోకంలో - "సింధూరారుణ విగ్రహాం" అని అమ్మ రూపము వర్ణించబడినది.

అదేవిధంగా, ఖడ్గమాలలో - "హ్రీంకారాసన గర్భితానలశిఖాం" అన్న పద ప్రయోగం ద్వారా, ఆ తల్లిని మనలో ఎక్కడ దర్శించవచ్చునో ప్రారంభంలోనే చెప్పబడింది. అనేది ప్రారంభంలోనే చెప్పబడినది. ఇన్నాళ్లూ ఆమె కోసం బయట వెతుకుతున్నాం. ఆమె బయట ఉంది; కానీ అలా బయట ఉన్న ఆమెను అనుభవం లోకి తెచ్చుకోవడం చాలా కష్టం, ఎందుకంటే "శ్రీయంత్రం ఒక లోహ వస్తువు. పంచలోహం" అని బుద్ధి చెబుతోంది. కానీ, మనస్సులో మనం ధ్యానం చేసే అమ్మ యొక్క రూపం, అన్ని చేతులలో ఆయుధాలు ధరించి, ప్రసన్న వదనయై ఉంటుంది. ఈ రూపానికి, బయట కనబడే లోహ రూపానికి మధ్య ఒక సంఘర్షణ ఎప్పుడూ ఉంటుంది. కనుక బయట మాత్రమే చూస్తే అనుభవం పూర్తిగా కలుగదు.

అది అనుభవంలోకి వచ్చినప్పుడు, ఇంక మనము కొత్తగా ఏమీ తెలుసుకోవలసిన అవసరం లేదు అన్న అద్భుత సత్యం గోచరిస్తుంది.

ఖడ్గమాల యొక్క నిత్య పారాయణ వల్ల ప్రపంచం వేరు, నేను వేరు అన్న అజ్ఞానమనే చీకటి గహ్వరంలోనుండి మనలను బయటకు లాగే జ్ఞానాగ్ని వెలిగించబడుతుంది. అందుకే, ఖడ్గమాల మొదట "**అనల శిఖాం**" అన్న పద ప్రయోగంతో ఫలితం కూడా వర్ణించబడింది. అదే విధంగా, ఆధ్యాత్మిక, ప్రాపంచిక విషయాలకు దోహదపడే అనేక శక్తులు గల మహిమాన్వితమైన ఈ ఖడ్గమాల గురించి తెలుసుకుందాము.



గురువాణి
శ్రీవిద్యా జ్ఞాన పీఠం

# కాంచీపురం శ్రీవిద్యా జ్ఞాన పీఠం అప్‌డేట్

## ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులు

**సరిహద్దు రేఖ సర్వే**: శ్రీవిద్యా జ్ఞాన పీఠం సరిహద్దు రేఖ సర్వేను స్థానిక ప్రభుత్వ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. మన పీఠం అభివృద్ధి ప్రక్రియలో ఈ ముఖ్యమైన దశ. మన భూమి విస్తీర్ణం మరియు దానిని మన రాబోయే ప్రాజెక్ట్‌ల కోసం ఎలా ఉపయోగించాలో పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

**కాంటూర్ సర్వే**: సరిహద్దు సర్వేతో పాటు సవివరమైన కాంటూర్ సర్వే కూడా పూర్తి చేశాం. ఈ రకమైన సర్వే మన భూమి యొక్క సహజ భూభాగం మరియు స్థలాకృతి గురించి అవసరమైన డేటాను అందిస్తుంది.

## జరుగుతున్న పనులు

**సైట్ డెవలప్‌మెంట్**: మనం ప్రస్తుతం సైట్ డెవలప్‌మెంట్ దశలో ఉన్నాము - ఇందులో ల్యాండ్ ఫిల్లింగ్ వంటి పనులు ఉన్నాయి. ఈ ప్రక్రియలో నిర్మాణం కోసం ల్యాండ్‌స్కేప్‌ని సరిదిద్దడం, భద్రత మరియు స్థిరత్వం కోసం అవసరమైన అన్ని నిబంధనలు మరియు ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం.

**బిల్డింగ్ అంచనాలు**: పీఠం పరిధిలోని వివిధ యూనిట్ల నిర్మాణానికి సంబంధించిన వివరణాత్మక అంచనాలను రూపొందించడంలో మేము చురుకుగా పని చేస్తున్నాము. ఈ అంచనాలు మెటీరియల్ ఖర్చులు, లేబర్, టైమ్ షెడ్యూల్‌లు మరియు మొత్తం బడ్జెట్ నుండి అన్ని అంశాలను కవర్ చేస్తాయి. సరైన ప్రాజెక్ట్ ప్రణాళిక మరియు ఆర్థిక నిర్వహణ కోసం ఈ కీలకమైన దశ అవసరం.

## పెండింగ్ పనులు:

**కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) ప్రాజెక్ట్ నివేదికలు**: కార్పొరేట్ దాతలకు అందించే సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను సిద్ధం చేసే ప్రక్రియలో ఉన్నాము. ఈ నివేదికలు మన ప్రాజెక్ట్‌ల స్వభావం మరియు కార్పొరేట్ సామాజిక బాధ్యత సూత్రాలకు అనుగుణంగా ఎలా ఉంటాయి అనే వివరాలను వివరిస్తాయి.

**CSR నిధులను పొందడంలో మనకు సహాయం చేయడానికి ఆసక్తి ఉన్న వారిని సంప్రదించవలసిందిగా మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము.**





# కాంచీపురంలో నిర్మించబడే శ్రీ విద్యా జ్ఞాన పీఠమునకు తోడ్పడండి!

**శ్రీ మాత్రే నమః**

అన్ని విద్యలలో కెల్లా గొప్పది శ్రీవిద్య అని చెప్పబడుతుంది. ఎందుకంటే, దీనిలో ప్రాపంచిక, ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకునే పద్ధతులు, అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇటువంటి శ్రీవిద్యను అందరికీ నేర్పేవారు కరువైపోవడమే కాదు, ఆ విద్యను శాస్త్రబద్ధమైన రీతిలో ఉపాసన చేయడానికి అనువైన ప్రదేశాలు కూడా తగ్గిపోయాయి. ఏ ఉపాసన అయినా ఏదైనా క్షేత్రంలో చేస్తే ఫలితం ఎక్కువగా ఉంటుందని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

ఈ లోటును తీర్చడానికా అన్నట్లు సుప్రసిద్ధ శక్తి పీఠములలో ఒకటైన కాంచీపురంలో 9 ఎకరాల విస్తీర్ణంలో ప్రసిద్ధ శ్రీ విద్యా ఉపాసకులైన శ్రీ గురు కరుణామయ గారిచే ఒక శ్రీ విద్యా జ్ఞాన పీఠము నిర్మించబడుతున్నది.

ఇందులో, శ్రీ విద్య ప్రధాన దేవత అయిన రాజరాజేశ్వరి, సదాశివునిమీద ఆశీనురాలై, 9 అడుగుల ఎత్తు గల విగ్రహ రూపంలో భక్తులను అనుగ్రహిస్తుంది. అమ్మవారికి ఇరువైపులా 5 అడుగుల ఎత్తు గల విగ్రహ రూపంలో రాజశ్యామల, వారాహీ దేవతలు భక్తులలో ఆకర్షణ శక్తిని పెంచి, వారిని వ్యతిరేక శక్తులనుండి (నెగెటివ్ ఎనర్జీ) కాపాడుతూ ఉంటారు.

అంతే కాదు. సంప్రదాయ రీతులలో విశాలంగా నిర్మించబడే యాగశాలలో అన్ని రకాల హోమ గుండములు, నిర్మాణం చేయబడతాయి. వీటితోబాటు, ఒక పెద్ద గోశాల, రెండు పుష్కరిణులు, వాటి చుట్టూ ఉపాసకులు కూర్చుని ధ్యానం చేసుకోవడానికి వసతులు, చిత్రాలలో చూపించిన విధంగా నిర్మించబడతాయి.

నక్షత్రవనం, ఔషధ వనాలతో పాటు, శాస్త్రములలో చెప్పబడిన శ్రీ విద్యా సాధనకు సంబంధించిన అన్ని పుష్ప,ఫల, పత్ర వృక్షములు 3 ఎకరాల స్థలంలో పెంచబడతాయి. ఈ వనంలో నడిస్తే, అనేక ఆరోగ్య సమస్యలు తీరడజాలై కాకుండా, గ్రహ సంబంధమైన సమస్యలు కూడా పరిష్కరించబడతాయి అని నమ్మకము.

వీటన్నింటితో బాటు, ఆసక్తి గల సాధకులు శాశ్వతంగా ఉండి ఉపాసన చేసుకోవడానికి, లేదా సంవత్సరంలో కొంత కాలం ఉండడానికి వీలుగా ప్రత్యేక వసతి గృహాలు నిర్మించబడతాయి.

కావున, భక్తులెల్లరూ ఈ బృహత్సంకల్పానికి దోహదపడుతూ, శ్రీవిద్యా ఉపాసకులకు మాత్రమే కాకుండా, పామర జనానికి కూడా ఉపయోగ పడే ఈ అద్భుత పీఠ నిర్మాణానికి ఇతోధికంగా విరాళాలు అందించి సహాయ పడవలసిందిగా వినమ్రంగా అర్థిస్తున్నాము.




దాతలు దిగువ ఇవ్వ బడిన QR code ను scan చేసి, విరాళాలు శ్రీ విద్యా లెర్నింగ్ సెంటర్ యొక్క యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ నందు జమచేయవచ్చును. మరిన్ని వివరములకు 8088256632, 9951998444, 8861858899 లలో ఏదైనా ఒక ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించగలరు.

డొనేషన్ ఇచ్చెడివారు వారివారి చిరునామా ఇచ్చినచో అమ్మవారి ప్రసాదము పంపించగలము





# శ్రీ దత్తాత్రేయ ఉపాసన



# వాక్శుద్ధి, వాక్సిద్ధి పొందాలనుకునే వారు చేయవలసిన దత్తాత్రేయ ఉపాసన

శ్రీ దత్తాత్రేయ స్వామి వారు త్రిమూర్తి స్వరూపము. దిక్కులే అంబరముగా కలిగిన వారు. గురు రూపంలో మనకు దొరికిన అపార జ్ఞాన నిధి. వారి మంత్రం లో ద్రాం బీజాక్షరం ముఖ్యంగా ఉంటుంది. ఇందులో దకారము ఇవ్వడాన్ని సూచిస్తే, రకారము చైతన్యవంతమైనటువంటి జ్ఞానాన్ని సూచిస్తుంది. స్థూలంగా చెప్పాలంటే, చైతన్యవంతమైన, స్థిరమైన జ్ఞానాన్ని ఇచ్చేవారు దత్తాత్రేయ స్వామి వారు.

దత్తాత్రేయ మంత్రం ఈ దిగువ ఇవ్వబడినది. దీనిని సద్గురువుల దగ్గర నుండి దీక్ష పొందిన తరువాతనే ఉపాసన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

**మంత్రము :**

**"ఓం హ్రీం ద్రాం దత్తాత్రేయ హరేకృష్ణ ఉన్మత్తానంద దాయక దిగంబర మునే బాల పిశాచ జ్ఞాన సాగర ద్రాం హ్రీం ఓం"**

ఈ మంత్రాన్ని జపము, అర్చనము, తర్పణము, హోమము, పారాయణము మొదలగు పద్ధతులలో ఉపాసన చేస్తే, అపరిమిత మైనటువంటి ఆనందము అంతర్ముఖంగా కలుగుతుంది.

ఈ మంత్రాన్ని లఘువుగా "**ఓం ద్రాం దత్తాత్రేయాయ నమః**" అని కూడా చెప్పుకోవచ్చును. ఏది ఏమైనా, గురువు యొక్క సూచనలనే పాటించ వలెను. మంత్రము విశుద్ధి చక్రములో జపము చేస్తూ ఉన్నప్పుడు వాక్శుద్ధి, వాక్సిద్ధి ఉపాసకులకు కలుగుతాయి.

## శ్రీ దత్తాత్రేయ స్వామి నిత్య పూజ

గతంలో వివరించబడిన నిత్య పూజా విధానములో మంత్రమునకు బదులు దత్తాత్రేయ మంత్రమును జోడించి, నిత్య పూజను నిర్వహించవలెను. (పూర్తి విధానము కొరకు వెబ్ సైట్ ను దర్శించండి.

## దత్తాత్రేయ స్వామి ఉపాసనా పద్ధతి

**జపము** :

ఏ మంత్రమైనా మంత్ర సిద్ధి చేయాలంటే, పురశ్చరణ చేయాలి. అంటే, మంత్రములో ఎన్ని అక్షరాలు ఉన్నాయో అన్ని లక్షల జపము, దానిలో దశాంశము హోమము, హోమములో దశాంశము తర్పణము, తర్పణములో దశాంశము మార్జనము, మార్జనములో దశాంశము బ్రాహ్మణ భోజనము శాస్త్రంలో చెప్పబడ్డాయి.

సాధారణ ఉపాసకులకు ఒక లక్ష జపము, పదివేల ఆహుతుల హోమము, ఒక వేయి సార్లు తర్పణము, ఒక వంద సార్లు మార్జనము, పది మందికి భోజనము చేసుకుంటే, ఫలితం తప్పక కనబడుతుంది.

జపము మానసికంగానో(పైకి వినపడకుండా మౌనంగా, మనసులో) లేదా ఉపాంశువు గానో (పెదవులు మాత్రమే కదులుతూ, శబ్దము పైకి వినపడకుండా) లేదా వాచికము గానో( పైకి ఉచ్చరిస్తూ) చేయవచ్చును. అన్నటికన్నా మానసిక జపానికి అత్యంత ఫలితం ఉంటుందని చెప్పబడింది. కానీ ఇది బహు కష్ట సాధ్యము. ప్రాథమిక స్థితిలో వాచిక ఉపాంశువుల మధ్య జపం చేయడం ఎంతైనా ఉచితం.

దత్తాత్రేయ మంత్రము ఎప్పుడైనా చేయవచ్చును. కానీ, నదీ తీరములోనో, సముద్ర తీరములోనో, దేవాలయములోనో, యజ్ఞ ప్రదేశములోనో చేసినప్పుడు అత్యుత్తమ ఫలితాన్ని పొందవచ్చును. ముఖ్యంగా గ్రహణ సమయంలో జపాన్ని ఎట్టి పరిస్థితులలోనూ మరువకూడదు. దీక్ష పొందిన పిదప, ఏ ఒక్క రోజూ వదలకుండా జపం చేయడం అవసరం.

జపము చేసే వారు ఉచితాసనం మీద తూర్పు ముఖముగా కూర్చుని, శుచిర్భూతులై తదేక దీక్షతో జపం చేయడం మంచిది. వారు ఎరుపు రంగు వస్త్రములు కానీ, కాషాయ రంగు వస్త్రములు కానీ ధరించినప్పుడు, అత్యుత్తమమైన ఏకాగ్రతను సాధించ గలుగుతారు.

**ధ్యాన శ్లోకము :**

**దత్తాత్రేయమహం వందే యోగముద్రా విరాజితం
బ్రహ్మచర్య వ్రతాసక్తం అవధూత స్వరూపిణం**

జపము చేయడానికి జపమాల కన్నా, ఒక నిముషంలో ఎన్ని సార్లు జపము చేయగలమో లెక్క గట్టుకుని, మనకు ఉన్న సమయంలో అరగంట కానీ, గంట కానీ, జపసంఖ్య మీద దృష్టి పోనివ్వకుండా, కేవలము మంత్రము, మంత్ర అధిష్ఠాన దేవత మీదే దృష్టి నిలిపి జపము చేసి, చివరగా, జపానికి వెచ్చించిన సమయాన్ని సంఖ్యగా మార్చుకోవడం ఉత్తమం.

ఇంకొక పద్ధతి ఉన్నది. ఒక పరిమితమైన కాల వ్యవధి నిర్ణయించుకుని, అనగా 40 రోజులు, 90 రోజులు..ఇలా కాల వ్యవధిని నిర్ణయించుకుని, ఈ కాలములో ఒక లక్ష జపం చేయడము వలన సంకల్ప సిద్ధి, క్రమశిక్షణతో కూడినటువంటి ఉపాసనను సాధించగలము.

ఈ పద్ధతిలో జపం చేస్తున్నప్పుడు, కొన్ని నియమాలు పాటించడం మంచిది.

1. ప్రతి రోజూ జపము ఒకే స్థలములో, ఒకే సమయములో, వీలైతే ఒకే ఆసనంలో చేయాలి. స్థలము, సమయములను మార్చకూడదు.

2. ప్రతి రోజూ చేస్తున్న జపము సాధ్యమైనంతవరకు సమముగా ఉండాలి. అనగా, ఒక రోజుకు 2 వేల జపం చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, అదే సంఖ్యను రోజూ కొనసాగించాలి. ఒక వేళ జప సంఖ్య ఎప్పుడైనా పెంచినట్లైతే, ఆ పెంచిన సంఖ్యను కొనసాగించాలి. ఇటువంటి నియమాలు మనలో సాధనా క్రమశిక్షణను వృద్ధి చేస్తాయి.

జపము చేయడానికి ముందు, అందరూ సర్వ సాధారణంగా చెప్పే, గురుధ్యానము, గణపతి ధ్యానము, ఆచమనము, ప్రాణాయామము, సంకల్పము చేసుకోవాలి.

**తర్పణములు :**

తర్పయతి ఇతి తర్పణము . భగవంతునికి మన ఆనందాన్ని కృతజ్ఞతను అర్పించుకొనడమే తర్పణము. మనలో చాలామందికి తర్పణము అంటే, పితృ దేవతలే గుర్తుకు వస్తారు. కానీ, తర్పణములలో దేవ తర్పణము, ఋషి తర్పణము, పితృ తర్పణము అని మూడు రకములు ఉన్నవి. తర్పణ జలము, కుడి చేతి మధ్య వేలు, ఉంగరం వేలు మధ్య నుండి విడిచి పెట్టినప్పుడు అది దేవ తర్పణము అవుతుంది. అదే అరచేతి ఎడమ పక్కనుండి (అనగా చిటికెన వేలు దిగువ భాగము నుండి విడిచి పెట్టినప్పుడు అది ఋషి తర్పణము అవుతుంది. అదే కుడి చేతిని పెడమరచి, బ్రొటన వేలి నుండి నీటిని విడిచిపెట్టినప్పుడు అది పితృ తర్పణము అవుతుంది. ఏ తర్పణమైనా, తర్పణ భావము ఒకటే అని గమనించాలి.

దత్తాత్రేయ తర్పణాలకు సుగంధ జలాలను గానీ, పంచామృతాలను గానీ వాడడం మంచిది. సుగంధ జలాలలో, ఏలకుల పొడి, పసుపు, గంధము, పచ్చ కర్పూరము, జాజికాయ జాపత్రుల పొడి, పన్నీరు మొదలగు వాటిని కలిపి ఉపయోగించాలి. మిగిలిన వస్తువులు దొరికినా, దొరకకపోయినా, పసుపు, గంధము మాత్రము తప్పనిసరిగా ఉండాలి.

క్రింద ఇవ్వబడిన దత్తాత్రేయ యంత్రాన్ని ముద్రించుకొని, దానిని laminate చేసుకుని, ఆ యంత్రానికి తర్పణాలు చేయవచ్చును. లేక, పంచ లోహములు, లేదా రాగితో చేసిన యంత్రాన్ని ఉపయోగించవచ్చును. అన్నిటికన్నా ప్రశస్తమైనది ఏమిటంటే, గంధముతో కానీ, విభూది మరియు గంధముల మిశ్రమంతో కానీ, శివలింగాకారం చేసి, దానిపైన తర్పణములు చేయవచ్చును.

(పూర్తి తర్పణాల వివరము కొరకు ......వెబ్ సైట్ దర్శించవచ్చును.)

తర్పణము చేసిన జలమును తీసుకుని, శిరస్సు మీద చల్లుకుంటూ, క్రింది మంత్రాన్ని పఠించాలి.
వాక్శుద్ధి, వాక్సిద్ధి, భక్తి జ్ఞాన వైరాగ్య, గాడ బద్ధ కర్మ పాశ నివృత్తి, సమస్త పాప క్షయ సహిత ఆత్మ సంస్కార సిద్ధ్యర్థం దత్తాత్రేయ తర్పణ తీర్థం స్వీకురుష్వ


పై మంత్రం తోనే కుడి చేతిలో తీర్థాన్ని తీసుకుని, ప్రసాదంలా స్వీకరించాలి.
ఇతి శివం.

**దత్తాత్రేయ హోమం :**

గతంలో వివరింపబడిన లఘు హోమ విధిలో మంత్రమునకు బదులు దత్తాత్రేయ మంత్రమును కలుపుకుని, యథావిధిగా హోమం నిర్వహించవలెను.

హోమమునందు ఆజ్యాహుతులు కానీ, లాజ ఆహుతులు కానీ, లేదా, దిగువ ఇవ్వబడిన ఏ హోమ పదార్థములైనా సమర్పించాలి.

## శ్రీ దత్తాత్రేయ యంత్రము



1. హవిస్సు(బియ్యము, పెసరపప్పు, జీలకర్ర కలిపి వండిన ప్రత్యేక హోమ పదార్థము)
2. విభూది
3. గంధము
4. తెల్ల ఆవాలు
5. తేనె
6. జాజికాయ, జాపత్రి మిశ్రమం
7. నల్ల నువ్వులు, బియ్యము(1-2 నిష్పత్తిలో) చేర్చిన మిశ్రమం
8. పచ్చ కర్పూరం, ఏలకులు పొడి మిశ్రమం
9. బిల్వ పత్రాలు
10. 10.సంపెంగ పుష్పాలు
11. 11.బ్రాహ్మి పత్రములు

యథావిధిగా పూర్ణాహుతి, హోప ఫల సమర్పణం నిర్వహించవలెను.

హరిః ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీవిద్యా సాధనలో ముఖ్య సంపత్తులైన వాక్శుద్ధి, వాక్సిద్ధి కలిగించే దేవత, విశుద్ధి చక్రంలో ఉన్న దత్తాత్రేయుల వారు. అందుచేత, దత్తాత్రేయ ఉపాసన కూడా శ్రీవిద్యలో ఒక ఉపాంగంగా కూడా చెప్పుకోవచ్చును. కావున, శక్తి, సమయము, శ్రద్ధ ఉన్న వారు, పైన వివరించిన విధంగా దత్తాత్రేయ ఉపాసన చేసి, అమ్మవారి యొక్క అనుగ్రహాన్ని దత్తాత్రేయ రూపంలో కూడా పొందవచ్చును.

## శ్రీ దత్త క్షేత్రములు

1. మహారాష్ట్ర, నాంథేడ్ జిల్లా కిన్వట్ తాలూకాలో గల మాహూర్.
2. సౌరాష్ట్ర, జునగాడ్ లో గల గిరినార్. ఇక్కడ 10,000 మెట్లు గలవు.
3. కరంజా. ఇక్కడే నృసింహ సరస్వతి స్వామి వారి జన్మ స్థలం. కాశీకి చెందిన శ్రీ బ్రహ్మానంద సరస్వతి వారు ఇక్కడ దత్త స్వామికి మందిరం కట్టించారు.
4. ఔదుంబర్. మహారాష్ట్ర లోని భిల్వాడీ రైల్వే స్టేషన్ నుండి 10 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నదీ తీరంలో ఈ మందిరం ఉన్నది. చాతుర్మాస దీక్ష సమయంలో శ్రీ నృసింహ సరస్వతీ స్వామి వారు ఇక్కడ నివసించారు.
5. నర్సోబా వాడీ. మహారాష్ట్రలో పంచగంగ మరియు కృష్ణా నదుల సంగమ స్థానంలో ఈ మందిరం ఉన్నది. ఇక్కడ నృసింహ సరస్వతీ స్వామి వారు 12 సంవత్సరాల పాటు నివసించారు. తెంబే స్వామి వారు ఇక్కడ నుండే ప్రేరణ పొందారు.

గంగాపూర్. ఈ మందిరం కర్ణాటక రాష్ట్రంలో, పూనే- రాయ్ చూర్ ప్రధాన మార్గం మీద ఉన్నది.

శ్రీ దత్తాత్రేయ ఉపాసన సంపూర్ణ విధి విధానము https://library.srimeru.org వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోచ్చు.



# కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి ఆలయం

సంపుటి -1 సంచిక 12



# కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి

## కొల్హాపూర్, మహారాష్ట్ర

**ఇప్పుడు జరుగుతున్నది శ్రావణమాసము. ఈ శ్రావణ మాసంలో అమ్మవారిని మహాలక్ష్మి అమ్మవారి రూపంలో పూజిస్తే, అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి. మన దేశంలో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాలలో విశిష్టమైనదిగా విరాజిల్లుతున్న క్షేత్రం కొల్హాపూర్. కోటానుకోట్ల భక్తులు అనునిత్యం పూజించే శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి మన దేశంలో విడిగా ఉన్న ఆలయాలు తక్కువే. అలాంటి లక్ష్మీదేవికి ప్రత్యేకించి ఉన్న ఆలయాల్లో కొల్హాపూర్ ఆలయం ముఖ్యమైనది.**

### ఆలయ విశిష్టత

ఈ ఆలయం మహారాష్ట్రలోని కొల్హాపూర్ ప్రాంతంలో పంచ గంగ నది ఒడ్డున ఉంది. ఇది అమ్మవారి అష్టాదశ శక్తి పీఠములలో ఏడవది. దక్ష యజ్ఞంలో దహనమైన సతీ దేవి నేత్ర ద్వయం ఇక్కడ పడింది. ఈ ఆలయానికి కొన్ని వేల సంవత్సరముల చరిత్ర ఉంది.

కొల్హాపూర్ పూర్వ నామము కరవీర నగరము. మహారాష్ట్రలో ఉన్న ఈ దివ్య ధామం మణిద్వీప సమాన క్షేత్రం. ఈ అమ్మవారిని దర్శించుకుంటే సకల సౌభాగ్యములు కలుగుతాయని నమ్మకం.

శంకరాచార్యుల వారు ఈ ఆలయాన్ని దర్శించి శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. మరియు మహాలక్ష్మి స్తోత్రాన్ని రచించారు. ఆ తరువాత కాలంలో విద్యాశంకర భారతి స్వామివారు ఈ క్షేత్రంలో ఒక మఠాన్ని నిర్మించారు. దత్తాత్రేయ స్వామి వారు ప్రతీ రోజు ఈ క్షేత్రంలో మధ్యాహ్నం భిక్ష చేస్తారు అని నమ్మకం. దీనికి చిహ్నంగా ఆయనకు ఇక్కడ చిన్న ఆలయం ఉంది. మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ సైతం అమ్మవారిని పూజించి తరించారు.



## స్థల పురాణం, పురాణ ప్రస్తావన:

పరమశివునికి కాశీ ఎలా స్థిర నివాసమో, అలాగే విష్ణు మూర్తి మరియు లక్ష్మి కొల్హాపూర్ లో స్థిరంగా ఉన్నారని చెబుతారు. వారు ఈ క్షేత్రాన్ని ఎప్పుడూ విడిచి పెట్టరు. పురాణ కథనం ప్రకారం ప్రళయ కాల సమయములో శివుడు కాశీ పట్టణమును తన త్రిశూలంతో ఎత్తి రక్షించిన విధంగా, మహాలక్ష్మి అమ్మవారు ఈ క్షేత్రాన్ని తన కరములతో రక్షించింది. అందుకని ఆవిడ కరవీర మహాలక్ష్మి అయ్యింది. అలాగే స్కాంద పురాణం, దేవి భాగవతంలో కూడా ఇదే ప్రస్తావన ఉన్నది.

ఇంకొక ప్రస్తావనలో, కోలాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన శ్రీ మహాలక్ష్మి ఇక్కడే కొల్హాపూర్ అధిష్ఠాన దేవతగా వెలిసింది అని ప్రతీతి. కోలాసురుడు ఓడిపోతూ “తన పేరుమీద ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందాలి” అని వరం కోరతాడు. అందువలన కూడా ఈ క్షేత్రం కొల్హాపూర్ గా ప్రసిద్ధి చెందిదని చెబుతారు.


కొల్హాపూర్ క్షేత్రంలోనే మహాలక్ష్మికి చెల్లెలు కూడా త్రయంబోలి మాతగా కొండ పైన వెలిశారు. కొల్హాసుర సంహారంలో అమ్మవారికి త్రయ౦బోలి మాత సహకరించింది. కోలాసుర రాక్షస సంహారంలో తోడ్పడినందుకు కృతజ్ఞతగా ప్రతీ ఏడాది శరన్నవరాత్రులలో లలితా పంచమి రోజున మహాలక్ష్మీ అమ్మవారు స్వయంగా త్రయ౦బోలి ఆలయానికి మేళ తాళాలతో విచ్చేస్తుంది. ఇప్పటికీ ఈ సంప్రదాయాన్ని వైభవోపేతముగా కొనసాగిస్తున్నారు.

కాశీ విశ్వనాథ క్షేత్రానికి ప్రత్యామ్నాయంగా మరో సుక్షేత్రాన్ని చూపించమని అగస్త్య మహాముని శివుడ్ని కోరగా దానికి శివుడు కాశీతో సమానమైన ప్రాశిష్ట్యం గల నగరం కొల్హాపూర్ అని అక్కడ శ్రీ మహాలక్ష్మి కొలువై ఉన్నారని చెప్తారు.





శ్రీ మహాలక్ష్మి ఆలయంలో భూవరాహ



## నిర్మాణ శైలి, ఆలయం లోని దేవతా మూర్తుల వివరాలు:

ఇప్పుడున్న అమ్మవారి ఆలయం షుమారు 6 వేల ఏళ్ళ క్రితం నిర్మించబడింది. ఆ తరువాత అనేక రాజుల పరిపాలనలో అభివృద్ధి చెందిన ఆలయం హే-మ్యాట్ పంక్తి శైలిలో అద్భుతమైన శిల్ప కళతో ఉంటుంది. నాలుగు దిక్కులా ముఖ ద్వారాలు ఉన్నాయి. ఆలయం ఐదు గోపురముల క్రింద ఉంటుంది. అపురూపమైన శిల్ప సౌందర్యంతో అలరాలే దేవి ప్రాంగణంలో కనిపించే 5 గోపురాలు మనిషిలోని పంచ ప్రాణాలకు ప్రతిరూపం. మధ్యలో ఒక గోపురం, నాలుగు దిక్కులా నాలుగు గోపురములు ఉంటాయి. తూర్పు గోపురములో మహాలక్ష్మి, మధ్యలో కుమార మండపం, పడమర గణపతి, ఉత్తర దక్షిణ గోపురముల క్రింద వరుసగా మహాకాళీ , మహా సరస్వతి కొలువై ఉంటారు. ఉపాలయాలలో వెంకటేశ్వర స్వామి, నవగ్రహాలు, కాలభైరవ, రాధా-కృష్ణ, వినాయకుడు, సింహవాహిని, తుల్య భవాని మొదలగు అనేక దేవీ దేవతలు ఉన్నారు.

## ప్రధాన దేవతా మూర్తి వైశిష్ట్యం

గర్భ గుడిలో, సుమారు 6 అడుగుల ఎత్తయిన చతురస్ర వేదిక మీద 2 అడుగుల పీఠముపైన, 3 అడుగుల ఎత్తయిన మహాలక్ష్మీ అమ్మవారు కూర్చొని ఉంటారు. చతుర్భుజి అయిన మహాలక్ష్మి తన నాలుగు చేతులలో నిమ్మ పండు, గద, డాలు, పానపాత్ర ధరించి ఉంటుంది. ఆదిశేషుడు ఛత్రమై ఉండగా సింహ వాహినిగా దర్శనం ఇస్తుంది. కొల్హాపూర్ అమ్మవారి విగ్రహం వజ్ర శిలా నిర్మితం. ఇంతటి ప్రత్యేకమైన శిలతో నిర్మితమై ఉన్న విగ్రహం మరే క్షేత్రంలోను ఉండదు. ఆ మూర్తి అనేక ఆభరణాలతో ముగ్ధ మనోహరముగా ఉంటుంది. వెనుక సింహ వాహనము కనపడుతుంది. మూల విరాట్టు పడమటి ముఖముగా ఉంటుంది.

మరొక విశేషం ఏమిటంటే, సంవత్సరానికి రెండు మూడు రోజుల పాటు సూర్యాస్తమయ సమయములో సూర్యుని కిరణాలు పడమటి కిటికీ గుండా అమ్మవారి ముఖాన్ని తాకుతాయి.



ఈ అద్భుత దర్శనము కోసం భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. గర్భ గుడి గోడపై శ్రీచక్రం ఉండడం కూడా ఇక్కడ ప్రత్యేకం.

మొదట, మహాలక్ష్మీ అమ్మవారిని ప్రతిష్టించిన తరువాత 11 వ శతాబ్దములో గాంధారాదిత్య హయాంలో మర మత్తులు, ప్రదక్షిణ బాట, ఏర్పాటై, వాటితో బాటు,మహాకాళి, మహాసరస్వతి ప్రతిష్ట జరిగాయి. మూల విరాట్టుకు మహాకాళీకి మధ్యనే మహాలక్ష్మి యంత్రం ప్రతిష్టించారు. దీని పైన గాజు ఫలకం ఉండడంతో దర్శించుకోడానికి వీలుగా ఉంటుంది.

మహారాష్ట్రీయులు అమ్మవారిని అంబాబాయ్ అని పిలుస్తారు. ఈ క్షేత్రం త్రిశక్తి నిలయంగా ప్రసిద్ధి గాంచింది. అందుకే ఇదే ఆలయ ప్రాంగణంలో శక్తి ప్రదాయిని కాళీమాత, విద్య ప్రదాయిని సరస్వతి అమ్మవారు సైతం ఉన్నారు. ఆ రకంగా, భుక్తి, శక్తి, ముక్తి – ఈ మూడూ లభించే అరుదైన క్షేత్రమే కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయం.

## అర్చన విశేషములు:

ఆలయములో అమ్మవారికి రోజుకి 5 సార్లు అర్చన జరుగుతుంది.

ఉదయం 5 గంటలకి శ్రీ మహాలక్ష్మికి సుప్రభాత సేవ జరుగుతుంది, కాకడ హారతి ఇస్తారు. ఉదయం 8 గంటలకి షోడశోపచార పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం, సాయంత్రాలలో షేజ్ హారతి ఇస్తారు. శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. చైత్ర మాసములో వచ్చే పౌర్ణమితో పాటుగా నవ రాత్రులకి అమ్మవారికి వేడుకలు జరుపుతారు. ప్రతీ శుక్రవారం సాయంత్రం పౌర్ణమి నాడు అమ్మవారిని ఆలయ ప్రాంగణములో ఊరేగిస్తారు. ఏడాదికి రెండు సార్లు ఆదిత్యుడే స్వయంగా ఉత్సవాలు నిర్వహిస్తాడు. అమ్మవారి మూల విరాట్టును సూర్య భగవానుడే స్వయంగా అభిషేకిస్తాడు. సౌరమానం ప్రకారం జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు తిరిగి నవంబర్ 9 నుంచి 11 వరకు సూర్య భగవానుడు అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తాడు. తొలి రోజున పాదాలపై రెండవ రోజున హృదయంపై మూడవ రోజున విగ్రహం మొత్తం సూర్యకిరణాలు ప్రసరిస్తాయి.

ఇక్కడ ప్రతీ ఏడాది చైత్ర మాసంలో జరిగే రథోత్సవం అత్యంత రమణీయం. ప్రతీ ఏడాది చైత్ర మాసంలో బ్రహ్మోత్సవం నిర్వహిస్తారు. ఈ క్షేత్రంలో ప్రత్యేకమైనవి, విశిష్టమైనవి శరన్నవరాత్రి వేడుకలు. ఈ సమయంలో అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనం ఇస్తుంది. శివ, శాక్తేయ, వైష్ణవ తత్వాన్ని ఆవిష్కరిస్తుంది. దీపావళి పర్వదిన వేళ ఆలయ ప్రాంగణాన్ని వేలాది దీపాలతో అలంకరిస్తారు, దీప స్వరూపిణి అయిన అమ్మవారిని దీపలక్ష్మిగా పూజిస్తారు. ఈ క్షేత్రంలో అభిషేకాలు, శుక్రవారం విశేష పూజలు, కుంకుమార్చనలు జరుగుతాయి. జనవరి, నవంబరు మాసాలలో కిరణోత్సవం, శరన్నవరాత్రులకు అలంకార ఉత్సవాలు, చైత్ర మాసంలో అమ్మవారి రథోత్సవం, కార్తీక మాసంలో నెల రోజుల పాటు దీపోత్సవం నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో దసరా నవ రాత్రులకి విశేష పూజలు జరుగుతాయి.

ఇక్కడి వాతావరణం సాధారణముగా చల్లగానే ఉంటుంది. శీతాకాలం మరింత ఆహ్లాదంగా ఉంటుంది. ఈ ఆలయానికి శ్రావణ మాసం, నవ రాత్రులలో భక్తుల తాకిడి ఎక్కువ ఉంటుంది.



## దర్శన సమయములు :

రోజూ ఉదయం 04 : 00 గంటల నుంచి రాత్రి 10 :00 గంటల వరకు

కార్తీక మాసంలో తెల్లవారు 02 :00 గంటల నుంచే దర్శనం ఉంటుంది.

## క్షేత్రాన్ని చేరుకునే మార్గములు:

విమాన మార్గము ద్వారా కొల్హాపూర్ విమానాశ్రయములో దిగవచ్చును.

రైలు మార్గము ద్వారా కొల్హాపూర్ రైల్వేస్టేషన్ లో దిగవచ్చును.


రోడ్డు మార్గము ద్వారా బస్సులో కొల్హాపూర్ బస్ స్టేషన్ చేరుకోవచ్చును.

## సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు :

శ్రీ కరవీర నివాసిని అంబాబాయి దేవస్థానం కమిటీ
0231 2626147

శ్రీ కరవీర నివాసిని అంబాబాయి దేవస్థానం ఆఫీసు
0231 2541779

దేవస్థానం మేనేజర్ గారు శ్రీ ధనాజీ యాదవ్
9823791011



# మనం భగవంతునితో ఎటువంటి సంబంధం కలిగి ఉండాలి?

నాస్తికులైనా, ఆస్తికులైనా కాదనలేని సత్యం ఏమిటంటే, ప్రతిదానికీ, మూలం ఒకటి ఉంటుంది. దేని నుండో, దేని ద్వారానో తయారవతుందే తప్ప, అకస్మాత్తుగా ప్రత్యక్షం కాదు. అలాగే, ఈ విశ్వానికి కూడా, ఒక సృష్టి కర్త లేదా ఒక మూలం ఉండే తీరుతుంది. దానినుండే అన్నీ ఉద్భవించాయి. ఆ శక్తిని భగవంతుడు అనవచ్చు, లేదా శక్తి అనవచ్చు. మూలం మాత్రం కాదనలేని నిజం.

ఈ సిద్ధాంతం ప్రకారం, ఈ విశ్వంలో యావత్తూ భగవంతుని అంశయే. అనగా భగవత్ పదార్థమే. అందుచేత, మొదట ద్వైత భావంతో ఆ శక్తిని చూసినా, ఆరాధించినా, ఆ శక్తికీ, నాకూ తేడా ఉండకూడదు – అని గ్రహించడమే ఉపాసన. అందుచేత, భగవంతునితో సంబంధ బాంధవ్యాల విషయానికి వస్తే, మనతో మనకు ఎటువంటి సంబంధ బాంధవ్యాలు ఉన్నాయో, అటువంటివే భగవంతునితో కూడా ఉండాలి. ఈ స్థితికి రావడానికి ముందు మనం చేయవలసిన ఉపాసన కొంత ఉన్నది.

1. మనకి, మూలానికి, మూలము చేత సృష్టించబడిన మిగిలిన ప్రపంచానికి అణుమాత్రం కూడా తేడా లేదు అన్న భావన పూర్ణంగా మనలో కలిగించుకోవాలి.

2. మనకి, మూలానికి, భేదాన్ని సృష్టించే మనలోని వికారాలను అన్నింటినీ ఒక్కొక్కటి వదులుకోవాలి. మూలానికి సర్వస్య శరణాగతి పొందాలి. అంటే ఇక్కడ కూడా ద్వైత భావం ఉన్నది. కానీ, మూలంలో ఏమున్నదో అది నాలోనూ ఉన్నది, నేను ప్రత్యేకించి కోరుకునేది ఏమీ లేదు, ఈ తేడాని పోగొట్టే జ్ఞానాన్ని కలిగించమని వేడుకోవాలి.

3. మనమందరం భగవంతుని అవతారములు కాబట్టి, ప్రవర్తనలో కూడా భగవంతుని స్తోత్రాలలో ఏ ఏ లక్షణాలు వివరింపబడ్డాయో, ఆ లక్షణాలతో జీవనాన్ని సాగించాలి. సృష్టిలో ఏర్పడే ప్రతి సంఘటన కూడా ప్రస్తుతమో లేక ఇంతకు ముందో నాచేతనే సృష్టింపబడినటువంటి సంఘటనలు అన్న ఒప్పుదల మనలో ఉండాలి. మన జీవితంలో జరిగే సంఘటనలకు ఇతర జీవాలను గానీ, ఇతర గ్రహాలను గాని బాధ్యులను చేయకూడదు.

భగవంతుడు ఎలాగ సృష్టి యావత్తుని నిబంధన రహితంగా ప్రేమించి పోషిస్తారో, అలాగే మనం కూడా చరాచర వస్తు ప్రపంచాన్ని ప్రేమించగలగాలి.

కాబట్టి, మన జీవన విధానంలో మనం చేసే పూజా పునస్కారాల వెనుక ఉన్న తత్వాన్ని మార్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇవన్నీ కూడా మన జీవన విధానాన్ని సూచించే సూచికలుగా భావించాలి, గ్రహించాలి, అలవరచుకోవాలి. మనము పరిపూర్ణులము అన్నది గ్రహించి, ఏ కోరికా లేని స్థితిని చేరుకోవడానికి ఉపాసన చేయాలి. అందుకే ఈశావాస్యోపనిషత్ లో పూర్ణమదః అని ప్రారంభించారు. అలాగే మనం చూసే ప్రపంచం కూడా పరిపూర్ణమే, దాన్ని మార్చడానికి ప్రత్యేకించి నా జీవితాన్ని ఖర్చు పెట్టనవసరం లేదు అన్న విజ్ఞతను పొందాలి.

ఇంకొకటి ఏమిటంటే, నా జీవితంలో నాతోబాటు జీవనం సాగించే వ్యక్తులు, నాకు ఎదురయ్యే వ్యక్తులు, నాకు కష్ట సుఖాలను కలిగించే వ్యక్తులు - వీరందరూ కూడా, నేను చేసిన కర్మఫలితాన్ని నాకు అందించడానికి వచ్చిన దేవదూతలుగా భావించాలి. ఈ రకంగా కర్మక్షయం ప్రారంభం అవుతుంది. క్రమేపీ, నిర్వాణ సూక్తం లో చెప్పినట్లు కర్మ నశించి, ఇంక అనుభవించాల్సింది ఏమీ లేదు కాబట్టి పునర్జన్మ ఉండదు. అప్పుడు ఈ కించిత్ ద్వైత భావన ఉన్నా తొలగిపోతుంది.

లలితా సహస్రనామంలో స్వాత్మానందలవీభూత, నిజాజ్ఞారూప నిగమా, మూలప్రకృతిరవ్యక్తా – ఇటువంటి పదప్రయోగాలు, ఈ విషయాన్నే పునరుద్ఘాటిస్తాయి. ఇదొక్కటే కాదు. భగవద్గీత మూలసారాన్ని తీసుకున్న, ఉపనిషద్ సారాన్ని తీసుకున్నా, అన్నీ చెప్పేది ఒకటే. మనకు, మనం చూసే దృశ్యానికి తేడా లేదు. అందుచేత, అనాజ్ఞాతంగా ఏర్పడిన ఈ తేడాను పోగొట్టుకోవడానికి, మంత్రము, పూజలు వంటివి ఉపాధులను తీసుకున్నా, అన్నీ కూడా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికే అన్న విషయం మర్చిపోకూడదు. ఈ దేవుడి కన్నా ఆ దేవుడు గొప్ప, ఈ ఆలయం కన్నా ఆ ఆలయం గొప్ప, ఈ మంత్రం కన్నా ఆ మంత్రం గొప్ప – అన్న అజ్ఞానం నుండి బయటపడాలి. సర్వం ఖల్విదం బ్రహ్మ అన్న వేదోక్త సారాన్ని మనం అనుభవం లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి.

గురువాణి
ప్రశ్నలు - సమాధానములు
సంపుటి -1 సంచిక - 11



# పూజా సమయంలో ఎటువంటి ఆసనం ఉండాలి?

**కేవలం పూజా సమయమే కాకుండా, ఏ సమయంలోనైనా, మనం కూర్చునే ప్రదేశం లోని స్పర్శ ద్వారా కొన్ని కర్మలు మనలను చేరుకుంటాయని చెప్పబడింది. ఆ రకంగా చూస్తే, ఖాళీ నేలపైన గానీ, రక్షణ లేని ఆసనం పైన ( అనగా అనేకమంది కూర్చునే కుర్చీలు) గానీ కూర్చొనడం అంత క్షేమం కాదు.**

అందువలన, క్లుప్తంగా చెప్పాలి అంటే, కూర్చునే ఆసనాన్ని, కూర్చునే ప్రదేశంలో సాక్షాత్తు లక్ష్మీ దేవిని ఆవాహనం చేసుకుని, ఆవిడ దివ్యమైన ఒడిలో కూర్చున్నాను అన్న గొప్ప దైవిక భావన కలగడం కోసం, చేతిలో అక్షతలు తీసుకుని, "హ్రీం ఆధార శక్తి కమలాసనాయ నమః" అన్న మంత్రంతో శక్తిపాతం గావించి కూర్చొనడం శ్రేష్ఠం. అలా వీలు కానప్పుడు, కనీసం "హ్రీం" అన్న బీజాక్షరాన్ని జపం చేసుకుని కూర్చున్నా సరిపోతుంది.

ఇకపోతే, ఆసనాలలో దర్భాసనం, జింక చర్మం, పులి చర్మం వంటి అనేక రకాల ఉపాధులు ఉన్నాయి. ఇక్కడ వచ్చిన సమస్య ఏమిటంటే, భక్తులు జపానికి ధ్యానానికి ఇచ్చేటటువంటి విలువ కన్నా ఎక్కువ విలువ ఈ ఆసనాలకు ఇవ్వడం వలన, అమ్మమీదనుండి దృష్టి తప్పడం జరుగుతుంది. ఎంతైనా ఈ ఉపాధుల వల్ల, కొంత ఉపయోగం ఉంటుంది.

ఉపాసకుని శక్తి భూమిని అంటి, క్షీణించకుండా ఈ ఆసనాలు కాపాడతాయి. **కానీ ఇక్కడ గ్రహించవలసినది ఏమిటంటే, భూమిని అంటడము అంటే, మనం ధ్యానం చేస్తున్నప్పుడు, మనలో ప్రాపంచిక, వ్యావహారిక, సాంసారిక భావనలు కలుగుతూ ఉండడమే ఇక్కడ భూమిని తాకుతూ ఉండడం. అవి పోగొట్టుకోనప్పుడు, ఏ ఆసనమైనా ఒక్కటే.**

"సుఖారాధ్యా శుభకరీ" అని లలితా సహస్రనామంలో చెప్పబడింది. పద్మాసనం వేసుకుని కూర్చొనడం శ్రేష్ఠమైనా అది కుదరనప్పుడు, శరీరాన్ని ఇబ్బంది పెట్టుకుని కష్టపడడం కన్నా, సుఖాసనం లో కూర్చొనడం ఉత్తమం.

ఏది ఏమైనా యోగశాస్త్రం ఏమి చెబుతుందంటే, ఏ ఆసనంలో కూర్చున్నా, ఉపాసకుని వయస్సు ఎంత ఉంటుందో అన్ని నిముషాలు కించిత్తు కూడా కదలకుండా కూర్చొనడం అవసరం. వెన్నెముక నిటారుగా ఉంచి, శిరస్సును సమంగా ఉంచి, హృదయ గహ్వరంలో అమ్మవారిని స్థిరపరచుకుని, ధ్యానం చేయడం అత్యుత్తమం. ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ప్రతి రోజూ జపం లేదా ధ్యానం చేయడం వలన విశేష ఫలితాలు లభిస్తాయి అని చెప్పబడింది.

# శ్రీవిద్యలో నా ప్రయాణం

శ్రీమతి సీతారామలక్ష్మి



**శ్రీ మాత్రే నమః. శ్రీ గురుభ్యో నమః.**

నా పేరు సీతారామలక్ష్మి. హైదరాబాదులో ఉంటాను. మొట్టమొదట, గురువుగారి వీడియో యూట్యూబ్ లో చూశాను. ఆసక్తి కలిగినందువల్ల, శ్రీవిద్య గురించి, యూ ట్యూబ్ లోని గురువుగారి ఈ వీడియోలు చూడడం ప్రారంభించాను.అంతకంటే రెండు సంవత్సరాల ముందు నుండి నాకు చిన్న ఆరోగ్య సమస్య ఉండేది. ఆ సమస్య నివారణకు సంబంధించి, గురువుగారి వీడియో ఒకదానిలో సమాధానం లభించింది. లలితా సహస్రనామం సంపుటికరణం చేయడం ద్వారా ఆ సమస్య తగ్గుతుంది అని గురువుగారు చెప్పడం జరిగింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా, నేను సంపుటికరణం ప్రారంభించాను.
షుమారు వారం రోజుల తరువాత నా సమస్య తగ్గుతున్నట్లుగా నేను గమనించాను.

చాలా రోజులుగా మంత్ర దీక్ష తీసుకోవాలని కోరిక ఉంది. గురువు దొరకలేదు – అని వెతుకుతున్న తరుణంలో, అమ్మ దయవలన గురువుగారు దొరికారు. ఏ గురువు కూడా ఇంత సులభంగా మంత్ర దీక్ష ఇవ్వరు. నా అదృష్టం వలన, కిందటి జన్మలో చేసుకున్న పుణ్యం వలన, నాకు ఈ గురువుగారు లభించారు.

నా సమస్య కోసం మందులు వాడడం మానేశాను. సంపుటికరణం చేసేటప్పుడు వచ్చే ప్రకంపనల వల్ల నా సమస్య తగ్గుతున్నట్లుగా నేను గమనించాను. గురువు గారి వీడియోలలో ఉన్న ఫోన్ నెంబర్ లో గురువు గారిని సంప్రదించి, శ్రీవిద్య క్లాసులో చేరాను. మొదటి మాడ్యూల్ లో, గణపతి మంత్ర జపం సమయంలో కూడా ప్రకంపనలు నేను గమనించగలిగాను. రాత్రి నిద్ర పట్టేది కాదు. మరునాడు పూజ అయ్యాక, “అమ్మా!ఏమి జరుగుతున్నదో తెలియడం లేదు, నువ్వే చూసుకోవాలి” అని అమ్మ దగ్గర చెప్పుకునే దాన్ని. అమ్మకి చెప్పాక ఆ ప్రకంపనలు తగ్గిపోయాయి. బాలా మంత్రం చేస్తున్నప్పుడు ఆ ప్రకంపనలు నా చుట్టూ తిరిగి వెళ్లిపోయేవి. “అమ్మ ఇక్కడ తిరుగుతోంది, నాకు రక్షణగా ఉన్నది” అని అర్థమైంది. “అమ్మ నా మాటలు వింటున్నది” అని అర్థం అయింది. గణపతి మంత్ర జపం చేసే రోజుల్లో, నా స్నేహితురాలికి కరోనా వచ్చింది. వారితో మేము సన్నిహితంగా ఉండటం వల్ల,మాకు కూడా కరోనా వస్తుందేమో అని భయపడ్డాను. రాత్రి నిద్రలో, ఆజ్ఞా చక్రం దగ్గర “నీకు ఏమీ అవదు నేను చూసుకుంటాను” అని వినిపించింది.

తరువాతి మాడ్యూల్ లో, గణపతి తర్పణాలు ప్రారంభించే ముందు మరి కొన్ని ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డాను. తర్పణాలు చేయటానికి నా శక్తి సరిపోయేది కాదు. “నువ్వు శక్తి ఇస్తేనే నీకు సేవ చేస్తాను. నా చేత సేవ చేయించుకోవాలి అనుకుంటే ఆరోగ్యం ప్రసాదించు” అని అమ్మకు చెప్పుకునేదాన్ని. అక్కడినుండి క్రమంగా పూజ చేసే శక్తి వచ్చింది. వారహి యంత్ర పూజ స్థాయికి వచ్చానుఅంటే గురువుగారి ఆశీర్వాదము మరియు అమ్మ దయ.

దేవుడు మరియు గురువు కనిపిస్తే, గురువుకే మొదట నమస్కరించాలి అని పెద్దల మాట. అమ్మ ఇంట్లో ఉండేలా చేసిన గురువు గారి ఋణం తీర్చుకోలేము. నా అభిప్రాయంలో, “గురువుగారి మాట కటువుగా ఉన్నా, మనసు వెన్న”. అందర్నీ మంచి మార్గంలోపెట్టడానికి కటువుగా మాట్లాడతారేమో అని నా అభిప్రాయం.

నాకు మంచి దారి చూపించిన గురువు గారికి మనసా, వాచా, కర్మణా – నమస్కారములు.

శ్రీ గురుభ్యో నమః



# ఎవరు గొప్ప?

ఒకసారి దేవతలకు, రాక్షసులకు మధ్య వాదులాట మొదలయింది. "మేము గొప్ప" అని దేవతలు అనగా, "కాదు కాదు, మేమే గొప్ప" అని రాక్షసులు అన్నారు. ఎవరు గొప్పో తేల్చుకుందామని, అందరూ కలసి బ్రహ్మ దేవుడి దగ్గరకు వెళ్లారు. "నా సృష్టిలో అందరూ నాకు సమానమే" అని బ్రహ్మ దేవుడు అన్నాడు.

"అలా కాదు, మాలో ఎవరు గొప్పో మీరు చెప్పవలసిందే" అని దేవతలు, రాక్షసులు పట్టుబట్టారు.

అప్పుడు, "నా సృష్టిలో దేవతలు రాక్షసులతో పాటు మానవులు కూడా ఉన్నారు కదా! వారిని కూడా పిలిచి ఎవరు గొప్పో పరిశీలిద్దాము" అని బ్రహ్మ దేవుడు అన్నాడు.

దేవతలు, రాక్షసులు సరే అన్నారు.

బ్రహ్మ దేవుని పిలుపు మేరకు కొందరు మానవులు కూడా అక్కడకు వచ్చారు.

అప్పుడు బ్రహ్మ దేవుడు, "మీలో ఎవరు గొప్పో తెలుసుకోవడానికి ఒక చిన్న పరీక్ష పెడతాను" అన్నాడు.

దేవతలు, రాక్షసులు, మానవులు "సరే" అన్నారు.

బ్రహ్మ దేవుడు గాలిలో చెయ్యి ఊపగానే, ఒక బుట్ట నిండా మామిడి పళ్లు, మరొక బుట్ట నిండా అరటి పళ్లు ప్రత్యక్షమయ్యాయి.


"ఈ ఫలాలనన్నింటినీ ఎవరు ముందు తింటారో వారే గొప్ప వారు" అని బ్రహ్మదేవుడన్నాడు.

వెంటనే ఆ ఫలాలను ఆరగించడానికి రాక్షసులంతా ముందుకు పరిగెత్తారు.

"ఆగండి!" అని బ్రహ్మదేవుడన్నాడు.

"ఈ ఫలాలను తినడానికి ఒక నియమం ఉన్నది" అని బ్రహ్మదేవుడు చెప్పాడు.

"ఏమిటది?" అని రాక్షసులు అడిగారు.



బ్రహ్మదేవుడు మరొక సారి గాలిలో చెయ్యి ఊపాడు. మరుక్షణమే, ప్రతి ఒక్కరి చేతులూ పొడుగాటి చెక్క ముక్కలకు కట్టివేయబడ్డాయి.

"మీ చేతులు వంగే అవకాశం లేదు. ఇప్పుడు ఈ ఫలాలను తిని చూపించండి" అని బ్రహ్మ దేవుడన్నాడు.

రాక్షసులు మొదట ప్రయత్నించి విఫలులయ్యారు. చేతులు వంగకపోతే ఏదైనా ఆహార పదార్థాన్ని మనం ఎలా తినగలము?

కొందరు దేవతలు ఆ ఫలాలను గాలిలోకి ఎగరేసి తినే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నం కూడా విఫలమై దేవతలు వెనుకకు వెళ్లి నిలుచున్నారు.

ఇక మానవుల వంతు రాగానే, అక్కడ ఉన్న మానవులంతా ఒకచోట చేరి, "ఏమి చేద్దాము?" అని చర్చించుకున్నారు. ఒక నిర్ణయానికి వచ్చారు.

పళ్ల బుట్టకు ఒకవైపు ఒకడు, మరొక వైపు మరొకడు, ఈ విధంగా అక్కడ ఉన్న మానవులంతా నిలబడ్డారు.


మొదటి వ్యక్తి, ఒక ఫలం చేతిలోకి తీసుకుని, చేతులు జాపి, ఎదురుగా ఉన్న రెండవ వ్యక్తికి తినిపించాడు.

అదే విధంగా రెండవ వ్యక్తి మరొక ఫలాన్ని తీసుకుని, మొదటి వ్యక్తికి తినిపించాడు.

అందరూ మానవులూ ఇదే పద్ధతిని అవలంబించారు. చూస్తూ ఉండగానే, అన్ని ఫలములూ మానవులు తినేశారు. ఓడిపోయిన దేవతలు, రాక్షసులు మానవులను మెచ్చుకున్నారు.

బ్రహ్మదేవుడు కూడా మానవులను మెచ్చుకుని, పక్క వారి మంచి కోరుకునే వారే మానవులు. వారికి బ్రహ్మ జ్ఞానం అబ్బినట్లే అని చెప్పాడు.

ఈ కథ ద్వారా మనం తెలుసుకున్న నీతి ఏమిటంటే, "అందరితో మంచిగా వ్యవహరించాలి. పరుల మేలు కోసం పాటుపడాలి."




## శ్లోకము

**పరోపకారాయ ఫలంతి వృక్షాః**
**పరోపకారాయ దుహంతి గావః**
**పరోపకారాయ వహంతి నద్యాః**
**పరోపకారార్థమిదం శరీరం**

అనగా, పరుల కొరకే చెట్లు ఫలములనిస్తాయి. పరుల కొరకే ఆవు పాలిస్తుంది. పరుల కొరకే నదులు ప్రవహిస్తూ ఉంటాయి. ఇదే విధంగా ఈ శరీరం పరోపకారము కోసమే అని మనం అర్థం చేసుకోవాలి.

మంచిమాట
మనకున్నది పదిమందితో పంచుకునే ఉదార హృదయం దేవతా గుణం కన్నా గొప్పది

## మంచిమాట

మనకున్నది పదిమందితో పంచుకునే ఉదార హృదయం దేవతా గుణం కన్నా గొప్పది

# ఆగష్టు నెలలో శ్రీవిద్యా జ్ఞాన పీఠం కార్యక్రమాలు

### గురూజీ టూర్ ప్రోగ్రామ్

ఆగస్టు 8 - 12: హైదరాబాద్ (తేదీలు ఇంకా ఫైనల్ కాలేదు)
15 - 19 ఆగస్టు: శృంగేరి మరియు హరిహర పుర క్షేత్ర సందర్శన (తేదీలు ఇంకా ఫైనల్ కాలేదు)
ఆగస్టు 22 -30: బిలాయ్, ఎంపీ

### గురూజీ 70వ పుట్టినరోజు

శ్రీ గురు కరుణామయ 70వ జన్మదినోత్సవం ఆగస్టు 29న దుర్గ్‌లోని జలరామ్ వాటికలో ఘనంగా జరగనుంది.






ఈ పండుగల ప్రాముఖ్యత గురించి - "శ్రావణ మాస విశిష్టత" అనే వ్యాసంలో వివరంగా వివరించబడింది.

- ఆగష్టు 12 - సర్వేషాం ఏకాదశి
- ఆగష్టు 20 - నాగ చతుర్థి
- ఆగష్టు 21 - గరుడ పంచమి
- ఆగష్టు 22 - మంగళగౌరీ వ్రతము
- ఆగష్టు 25 - వరలక్ష్మీ వ్రతము
- ఆగష్టు 27 - పుత్ర ఏకాదశి
- ఆగష్టు 31 - రాఖీ పూర్ణిమ

# పంచదశి దీక్ష మరియు గురు పూర్ణిమ కార్యక్రమాలు



జూలై 2న గురూజీ మరియు అమ్మ సాధకులకు పంచదశి దీక్ష ఇచ్చారు















# శ్రీవిద్యా జ్ఞాన పీఠం కార్యక్రమలు - పంచదశి దీక్ష మరియు గురు పూర్ణిమ

2023వ సంవత్సరం, జులై 2 మరియు 3 తారీఖులలో, హైదరాబాద్ లో, గురు పౌర్ణమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

అమ్మ మరియు గురూజీ శిష్యులు గురు పూర్ణిమను భక్తిశ్రద్ధలతో, ఆనందంతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా, గురూజీ శిష్యులకు గురుపాదుకలతో ఆశీర్వదించారు మరియు గురుపాదుక పూజను నిర్వహించారు. అనంతరం గురు మండల పూజ, గురు హోమం నిర్వహించారు.

## పంచదశీ మంత్ర దీక్ష

మొదటి రోజు, అనగా జులై 2వ తారీఖు, ఆదివారం నాడు, 44 మంది ఉపాసకులకు, సువర్ణ నదీజలాలతో అభిషేకానంతరం, పంచదశీ మంత్ర దీక్ష ఇవ్వబడినది. షుమారు 5 గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో, మంత్ర దీక్ష మరియు లక్ష పంచదశీ మంత్ర జపం జరిగాయి. సాయంత్రం హోమము, తర్పణములు, మార్జనము నిర్వహించుట ద్వారా పంచదశీ మంత్ర పురశ్చరణ నిర్విఘ్నంగా పూర్తి అయింది. సాయంత్రం వేళ, గురువు గారి చేతుల మీదుగా, షుమారు 300 మంది ఉపాసకులకు గురుపాదుకలు ఇవ్వబడ్డాయి.

## గురు పౌర్ణమి

రెండవ రోజు, అనగా జులై 3 వ తారీఖు, సోమవారం నాడు, గురుమండల పూజ నిర్వహించబడింది. ఇదే సమయంలో షుమారు 300 మంది ఉపాసకులు కూడా తమ వద్దనున్న గురుపాదుకలకు పూజ నిర్వహించారు. సాయంత్రం వేళ గురు మంత్ర యుక్త హోమము నిర్వహించబడినది. గురువు గారి శిష్యులు, ఉపాసకులు అందరూ గురువు గారి ఆశీర్వాదము తీసుకొనుట ద్వారా ఈ కార్యక్రమం సుసంపన్నం అయింది.

# గురువాణి

కాల నిర్ణయ పట్టిక




శ్రీ శోభకృత్ నామ సంవత్సరం

# 2023

కలియుగాది 5124, శాలిశకం 1945

వర్ష ఋతువు అధికశ్రావణమాసము

# JULY-AUGUST



| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN** భాను (ఆది)<br>రాహు సా.4.30 ల 6.00<br>సా.దు. 4.25 ల 5.13 | | **23** ౩౧<br>పంచమి ఉ.7.50 ల<br>ఉత్తర సా 4.59<br>అమృ ప.9.06 ల 10.51<br>రా.వ. 2.1 ల 3.44 | **30** ౭<br>ద్వాదశీ ఉ.7.6 త్రయోదశీ తె.5.19<br>మూల రా.7.48<br>అమృ ప.1.38 ల 3.10<br>ఉ.వ.5.57వరకు<br>రా.వ.6.14ల7.47 తెవ 4.54ల | **6** ౧౪<br>పంచమి ప.1.5<br>ఉత్తరాభాద్ర ప.9.19<br>అమృ ఉ.6.16 వరకు<br>రా.వ. 8.45 ల 10.16 | **13** ౨౧<br>ద్వాదశీ ఉ.8.56<br>ఆర్ద్ర ప.10.6<br>అమృతం లేదు<br>రా.వ.11.4 ల 12.47 |
| **MON** ఇందు (సోమ)<br>రాహు ఉ.7.30 ల 9.00<br>ప.దు. 12.24 ల 1.12<br>ప.దు. 2.46 ల 3.34 | | **24** శ్రా౧<br>షష్ఠి ప.9.11<br>హస్త సా.6.50<br>అమృ ప.12.20 ల 2.3<br>రా.వ. 3.17 ల 4.58 | **31** ౮<br>చతుర్దశీ రా.3.13<br>పూర్వాషాఢ రా.6.37<br>అమృ ప.2.1 ల 3.32<br>ఉ.వ. 6.26 వరకు<br>రా.వ. 2.7ల 3.37 | **7** ౧౫<br>షష్ఠి ప.11.13 రేవతి ఉ.8.12<br>అమృ ఉ.5.54ల 7.25<br>పునరమృ రా.12.26 ల 1.59<br>రా.వ. 3.32 ల 5.4 | **14** ౨౨<br>త్రయోదశీ ప.10.13<br>పునర్వసు ప.12.3<br>అమృ ప.9.26 ల 11.10<br>రా.వ. 8.49ల 10.34 |
| **TUE** భౌమ(మంగళ)<br>రాహు ప.3.00 ల 4.30<br>ఉ.దు. 8.24 ల 9.12<br>రా.దు. 10.46 ల 11.36 | **18** ౨౬<br>అధిక శ్రావణశుక్లపాడ్యమి<br>రా.12.15 పుష్యమి పూర్తి<br>అమృ రా.12.0 ల 1.46<br>ప.వ.1.25 ల 3.11 | **25** ౨<br>సప్తమి ప.10.2<br>చిత్ర రా.8.12<br>అమృ ప.1.26 ల 3.7<br>రా.వ. 1.59 ల 3.38 | అధిక శ్రావణ శుక్ల **1** ౯<br>m పూర్ణిమ రా.12.51<br>ఉత్తరాషాఢ సా.5.9<br>అమృ ప.11.8 ల 12.38<br>రా.వ. 8.53 ల 10.22 | **8** ౧౬<br>సప్తమి ప.9.43<br>అశ్విని ఉ.7.25<br>అమృ రా.2.17 ల 3.51<br>సా.వ. 4.51ల 6.25 | **15** ౨౩<br>చతుర్దశీ ప.11.55<br>పుష్యమి ప.2.23<br>అమృ ఉ.7.20 ల 9.6<br>తె.వ. 4.31 ల |
| **WED** సౌమ్య(బుధ)<br>రాహు ప.12.00 ల 1.30<br>ప.దు. 11.36 ల 12.24 | **19** ౨౭<br>విదియ రా.2.11<br>పుష్యమి ఉ. 7.5<br>అమృతం లేదు<br>రా.వ. 9.15 ల 11.1 | **26** ౩<br>అష్టమి ప.10.24<br>స్వాతి రా.9.2<br>అమృ వ.11.55ల 1.34<br>రా.వ. 2.43 ల 4.20 | ○ **2** ౧౦<br>బ.పాడ్యమి రా.10.25<br>శ్రవణం ప.3.34<br>అమృ ఉ.5.50 ల 7.20<br>పునరమృ తె.4.13 ల 5.42<br>రా.వ.7.17 ల 8.46 | **9** ౧౭<br>అష్టమి ఉ.8.36<br>భరణి ఉ.7.1<br>అమృ తె.4.37 ల<br>రా.వ. 7.1 ల 8.37 | ● **16** ౨౪<br>l అమావాస్య ప.1.49<br>ఆశ్రేష సా.4.54<br>అమృ ప.3.8ల 4.54<br>ఉ.వ. 6.17 వరకు |
| **THU** బృహస్పతి(గురు)<br>రాహు ప.1.30 ల 3.00<br>ప.దు. 10.00 ల 10.48<br>పు.దు. 2.48 ల 3.36 | **20** ౨౮<br>తదియ తె.4.15<br>ఆశ్రేష ప.9.41<br>అమృ ఉ.7.53 ల 9.41<br>రా.వ.10.59 ల 12.45 | **27** ౪<br>నవమి ప.10.16<br>విశాఖ రా.9.24<br>అమృ ప.12.28 ల 2.5<br>రా.వ.1.22 ల 2.58 | **3** ౧౧<br>విదియ రా.7.57<br>ధనిష్ఠ ప.1.55<br>అమృ తె.5.32 ల<br>రా.వ.8.36 ల 10.5 | **10** ౧౮<br>నవమి ఉ.7.55 కృత్తిక ఉ.7.3<br>అమృ ఉ.6.13 వరకు<br>పునరమృ తె.4.18ల 5.56<br>రా.వ.11.24 ల 1.2 | |
| **FRI** భృగు (శుక్ర)<br>రాహు ప.10.30 ల 12.00<br>ఉ.దు.8.24 ల 9.12<br>పు.దు. 12.24 ల 1.12 | **21** ౨౯<br>చవితి పూర్తి<br>మఘ ప.12.18<br>అమృ ప.9.38 ల 11.24<br>రా.వ.9.7 ల 10.53 | **28** ౫<br>దశమి ప.9.39<br>అనూరాధ రా.9.16<br>అమృ ప.10.55 ల 12.30<br>రా.వ.2.44 ల 4.18 | **4** ౧౨<br>తదియ సా.5.29<br>శతభిషం ప.12.14<br>అమృ ఉ.7.1 వరకు<br>పునరమృ రా.3.12 ల 4.41<br>రా.వ.6.13 ల 7.43 | **11** ౧౯<br>దశమి ఉ.7.45<br>రోహిణి ఉ.7.34<br>అమృ రా.11.24 ల 1.4<br>ప.వ.1.24 ల 3.4 | |
| **SAT** స్థిర (శని)<br>రాహు ఉ.9.00 ల 10.30<br>ఉ.దు. 6.00 ల 7.36 | **22** ౩౦<br>చవితి ఉ.6.9<br>పుబ్బ ప.2.46<br>అమృ ఉ.7.42 ల 9.28<br>రా.వ.10.37ల 12.22 | **29** ౬<br>ఏకాదశీ ఉ.8.33<br>జ్యేష్ఠ రా.8.44<br>అమృ ప.12.7 ల 1.41<br>తె.వ. 4.25 ల | **5** ౧౩<br>చవితి ప.3.11<br>పూర్వాభాద్ర ప.10.41<br>అమృ తె.4.46 ల<br>రా.వ. 7.43ల 9.14 | **12** ౨౦<br>ఏకాదశీ ఉ.8.5<br>మృగశిర ఉ.8.36<br>అమృ రా.11.28ల 1.11<br>సా.వ. 5.31ల 7.13 | |

### పండుగలు

**జూలై**

20 పుష్యమికార్తె తె.5.22

**ఆగస్టు**

3 ఆశ్రేషకార్తె తె.5.38

8 శుక్రమౌఢ్యమి ప్రారంభం

12 సర్వ ఏకాదశీ

14 మాస శివరాత్రి

15 స్వాతంత్ర్య దినోత్సవం

16 సర్వ అమావాస్య




శ్రీ శోభకృత్ నామ సంవత్సరం

# 2023

కలియుగాది 5124, శాలిశకం 1945

వర్ష ఋతువు నిజశ్రావణమాసము

# AUGUST-SEPTEMBER

**పండుగలు**

ఆగస్టు
17 సింహ సంక్రమణం
తె. 4.22 మఘకార్తె
18 శుక్రమౌఢ్య త్యాగం
19 వనదుర్గా సంచారం
20 నాగ చతుర్థి
దూర్వాగణపతి వ్రతం
21 గరుడ పంచమి
22 మంగళగౌరీ వ్రతం
**25 శ్రీవరలక్ష్మీ వ్రతం**
27 పుత్ర ఏకాదశీ
29 వరాహ జయతి

31 రాఖీపూర్ణిమ జంధ్యాల
పూర్ణిమ రక్షాబంధనం
పుబ్బకార్తె రా. 12.47

సెప్టెంబరు
6 శ్రీకృష్ణ జన్మాష్టమి
10 కామ ఏకాదశీ
13 మాస శివరాత్రి
14 సర్వ అమావాస్య,
ఉత్తరకార్తె సా. 6.41

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN**<br>భాను (ఆది)<br>రాహు సా.4.30 ల 6.00<br>సా.దు. 4.25 ల 5.13 | | **20** ౨౮<br>చవితి రా.8.57<br>హస్త రా.2.18<br>అమృ రా.7.48 ల 9.31<br>ఉ.వ. 9.26 ల 11.9 | **27** ౪<br>ఏకాదశీ సా.5.18<br>పూర్వాషాఢ రా.2.44<br>అమృ రా.10.09 ల 11.41<br>ప.వ.1.1 ల 2.32 | **3** ౧౧<br>చవితి రా.11.17<br>రేవతి సా.4.8<br>అమృ ప.1.51 ల 3.22<br>ఉ.వ. 6.15 వరకు | **10** ౧౮<br>ఏకాదశీ రా.10.21<br>పునర్వసు రా.7.15<br>అమృ సా.4.39 ల 6.22<br>ఉ.వ. 6.18 ల 8.2<br>రా.వ. 3.59 ల 5.43 |
| **MON**<br>ఇందు (సోమ)<br>రాహు ఉ.7.30 ల 9.00<br>ప.దు. 12.24 ల 1.12<br>ప.దు. 2.46 ల 3.34 | | **21** ౨౯<br>పంచమి రా.9.53<br>చిత్ర రా.3.49<br>అమృ రా.9.0 ల 10.42<br>ప.వ. 10.48 ల 12.30 | **28** ౫<br>ద్వాదశీ ప.3.12<br>ఉత్తరాషాఢ రా.1.17<br>అమృ రా.7.16 ల 8.46<br>ప.వ.10.14 ల 11.45<br>తె.వ. 5.01 ల | **4** ౧౨<br>పంచమి రా.9.47<br>అశ్విని ప.3.16<br>అమృ ఉ.8.19 ల 9.51<br>ప.వ. 11.24 ల 12.56<br>రా.వ.12.39 ల 2.13 | **11** ౧౯<br>ద్వాదశీ రా.12.2<br>పుష్యమి రా.9.29<br>అమృ ప.2.28 ల 4.12<br>వర్జ్యము లేదు |
| **TUE**<br>భౌమ(మంగళ)<br>రాహు ప.3.00 ల 4.30<br>ఉ.దు. 8.24 ల 9.12<br>రా.దు. 10.46 ల 11.36 | | **22** ౩౦<br>షష్ఠి రా.10.18<br>స్వాతి తె.4.46<br>అమృ రా.7.36 ల 9.16<br>ప.వ. 9.38ల 11.17 | **29** ౬<br>త్రయోదశీ ప.12.56<br>శ్రవణం రా.11.43<br>అమృ ప.1.59 ల 3.29<br>ఉ.వ. 6.30 వరకు<br>రా.వ.3.26 ల 4.55 | **5** ౧౩<br>షష్ఠి రా.8.39<br>భరణి ప.2.45<br>అమృ ప.10.3 ల 11.37<br>రా.వ. 2.43 ల 4.18 | **12** ౨౦<br>త్రయోదశీ రా.2.1<br>ఆశ్రేష రా.12.00<br>అమృ రా.10.13 ల 12.00<br>ప.వ. 11.37 ల 1.23 |
| **WED**<br>సౌమ్య(బుధ)<br>రాహు ప.12.00 ల 1.30<br>ప.దు. 11.36 ల 12.24 | | **23** ౩౧<br>సప్తమి రా.10.15<br>విశాఖ తె.5.18<br>అమృ రా.8.17ల 9.55<br>ప.వ.10.29ల 12.7 | **30** ౭<br>చతుర్దశీ ప.10.32<br>ధనిష్ఠ రా.10.2<br>అమృ ప.12.21 ల 1.50<br>తె.వ. 4.43 ల 6.12 | **6** ౧౪<br>సప్తమి రా.8.1<br>కృత్తిక రా.2.42<br>అమృ ప.12.17 ల 1.53<br>వర్జ్యము లేదు | **13** ౨౧<br>చతుర్దశీ తె.4.6<br>మఘ రా.2.37<br>అమృ రా.11.57 ల 1.44<br>ప.వ.1.18 ల 3.5 |
| **THU**<br>బృహస్పతి(గురు)<br>రాహు ప.1.30 ల 3.00<br>ప.దు. 10.00 ల 10.48<br>పు.దు. 2.48 ల 3.36 | **17** ౨౫<br>నిజశ్రావణశుక్లపాడ్యమి సా.3.52<br>మఘ రా.7.32<br>అమృ సా.4.51ల 6.38<br>ఉ.వ.6.12 ల 7.59<br>తె.వ. 4.22ల | **24** భా౧<br>అష్టమి రా.9.39<br>అనూరాధ తె.5.16<br>అమృ రా.6.52 ల 8.28<br>ప.వ.9.17 ల 10.53 | ○ **31** ౮<br>m పూర్ణిమ ఉ.8.3<br>బ.పాడ్యమి తె.5.36<br>శతభిషం రా.8.21<br>అమృ ప.1.38 ల 3.8<br>ఉ.వ.6.12వ రా.వ.2.19ల3.49 | **7** ౧౫<br>అష్టమి రా.7.50రోహిణి ప.3.6<br>అమృ ప.11.50 ల 1.28<br>ఉ.వ. 6.57 ల 8.35<br>రా.వ.8.54 ల 10.34 | **14** ౨౨<br>1 అమావాస్య పూర్తి<br>పుబ్బ తె.5.13<br>అమృ రా.10.7 ల 11.53<br>ప.వ. 11.28 ల 1.15 |
| **FRI**<br>భృగు (శుక్ర)<br>రాహు ప.10.30 ల 12.00<br>ఉ.దు.8.24 ల 9.12<br>పు.దు. 12.24 ల 1.12 | **18** ౨౬<br>విదియ సా.5.48<br>పుబ్బ రా.10.3<br>అమృ ప.2.58 ల 4.44<br>ఉ.వ. 6.8 వరకు | **25** ౨<br>నవమి రా.8.31<br>జ్యేష్ఠ రా.4.44<br>అమృ రా.8.8 ల 9.42<br>ప.వ.10.44 ల 12.18 | నిజ శ్రావణ బహుళ **1** ౯<br>విదియ రా.3.17<br>పూర్వాభాద్ర సా.6.46<br>అమృ ప.11.17 ల 12.46<br>రా.వ.3.47 ల 5.17 | **8** ౧౬<br>నవమి రా.8.12<br>మృగశిర సా.4.1<br>అమృ ఉ.6.52 ల 8.32<br>రా.వ.12.53 ల 2.35 | ● **15** ౨౩<br>1 అమావాస్య ఉ.6.5<br>ఉత్తర పూర్తి<br>అమృ రా.11.37 ల 1.22<br>ప.వ. 1.6 ల 2.51 |
| **SAT**<br>స్థిర (శని)<br>రాహు ఉ.9.00 ల 10.30<br>ఉ.దు. 6.00 ల 7.36 | **19** ౨౭<br>తదియ రా.7.34<br>ఉత్తర రా.12.22<br>అమృ సా.4.28 ల 6.13<br>ఉ.వ.5.56 ల 7.42 | **26** ౩<br>దశమి రా.9.5మూల రా.3.53<br>అమృ రా.9.41 ల 11.14<br>ప.వ. 12.26 ల 1.59<br>రా.వ. 2.19 ల 3.52 | **2** ౧౦<br>తదియ రా.1.8<br>ఉత్తరాభాద్ర సా.5.20<br>అమృ ప.12.48 ల 2.18<br>తె.వ.4.44 ల | **9** ౧౭<br>దశమి రా.9.1<br>ఆర్ద్ర సా.5.23<br>అమృ ఉ.6.48 ల 8.30<br>వర్జ్యము లేదు |  |

# సూక్తి

మాసం అధికమైనా, శూన్యమైనా, మనం చేసే పనులేవీ మానటం లేదు కదా!అమ్మ ఆరాధన కూడా అంతే.

~ శ్రీ గురు కరుణామయ



guruvaani

**Srividya Learning Centre**
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org

Guruvaani is a Digital monthly newsletter published in English & Telugu by Srividya Learning Centre.